221059001

విలువలేని ఇనుపపెట్టె ఈ దేహంబు
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మ దేవుడుండెను సుమీ
సత్యమైన బాట సాయి మాట.
దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడనగ తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల దగిలియుండు.

దివ్యాత్మ స్వరూపులారా!

విలువలేనిదైనప్పటికిని, అస్థిరమైనది అయినప్పటికిని యీ మానవ దేహము ఆత్మ దేవునకు నివాసమగుటచేత దీనిని సక్రమమైన మార్గములో కాపాడుకోటం ప్రతి మానవుని కర్తవ్యము. దేహ పోషణ మానవుని ప్రధాన కర్తవ్యము. ధృఢత్వమే లేని దేహమునందు మానవత్వము అనేక చిక్కులపాలు కాగలదు. మానవ జీవితము దేహమనే పునాదిపైన ఆధారపడి వుంటున్నది. కనుకనే ఆధునికమైన వైజ్ఞానమునకు కారకులైన రోమను దేశము వారు కూడను యీ దేహము యొక్క విశిష్టతను గుర్తించి వారు యీ దేహ పోషణ నిమిత్తమై అనేక విధములైన శ్రద్ధను తీసుకొనెడివారు. ఈ దేహము తనంత తానైనటువంటి ఒక ప్రత్యేకమైన ప్రపంచము. దేహమనగా కేవలము ఒక ఆకారము మాత్రమే కాదు. అనేక అంగములతో కూడిన సమిష్టి స్వరూపము. ఏ అంగమునకు ఆ అంగము ఆవశ్యమైనది. అన్ని అంగముల యొక్క సౌందర్యమును మనము కాపాడుకోవలసిన కర్తవ్యము. అనారోగ్యమునకు గురియైన దేహము, బలహీనతకు గురైన దేహము ఒక ధృఢమైన సంకల్పమును చేయలేదు. పవిత్రమైన, దివ్యమైన, భవ్యమైన భావములు మానవుని నుండి ఆవిర్భవించవలెనన్న శరీరము ధృఢమైనదిగను ఆరోగ్యవంతమైనదిగను వుండాలి.

అన్ని మతముల వారు దేహము యొక్క పోషణను అంగీకరించినవారే. ఇది అనిత్యము అశాశ్వతము అయినప్పటికిని సత్యనిత్యమైన దివ్యత్వము యిందులో నివాసము

గా వుండటం చేత యీ దేహముపైన ప్రత్యేకమైన శ్రద్ధను చూపాలి. కనుక

మతములన్నియు చేరి మంచినే బోధించె
తెలిసి మెలగవలయు తెలివితోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది
వినుడు భారతీయ వీరసుతుడ.

అన్ని మతములు ఒకేది బోధించినప్పటికి సమిష్టి క్షేమమునకే గాని వ్యక్తిక్షేమమునకు కాదని మనము గుర్తించాలి. మలమూత్ర దుర్గంధ మాంసరక్తములతో కూడిన యీ దేహమునందే దివ్యభవ్యమైన ఆత్మతత్వము రాణిస్తూ వుంటున్నాది. దేహ బలహీనము చేత యిది తరగదు. దేహబలము చేత యిది పెరగదు. పెరిగి తరగని తత్వమే ఆత్మతత్వము. ఇది నిరంతరము పవిత్రమైనదే. విలువైనదే. బలమైనదే. ఎట్టి పరిస్థితులయందు దీని విలువ యేమాత్రము తగ్గదు.

పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన
విలువ మారబోదు వెలుగు పోదు.
మంచి గుమ్మపండు కంచెలో కాచిన
రుచియు మారబోదు చవియు పోదు
గొప్ప నెమలి గ్రుడ్డు కోడి తా పొదగిన
వన్నె మారదు దాని చిన్నె పోదు.

దేహము అనేక మాలిన్యములతో కూడినదైనప్పటికిని యిందులో నిర్మలమూ, నిశ్చలమూ, నిస్వార్థము ఆత్మతత్వము నిరంతరము ప్రకాశిస్తూనే వుంటుంది. ఐతే అన్ని మతముల వారు యీ దేహములో వుండిన పుష్టిని సంతుష్టిని కోరటములో అర్థమేమిటి? దేహమనేది భగవంతుని దేవాలయము అనే విశ్వాసమే దీనికి మూలకారణము.

కనుక యీ పవిత్రమైన దేహమును అలక్ష్యము చేయక, అశ్రద్ధ పూనక, తగిన శ్రద్ధతో దీనిని సరియైన మార్గములో ప్రవేశపెట్టి దీని కర్తవ్యకర్మలు ఆచరించటము మానవుని ప్రధాన కర్తవ్యము. కాని యిట్టి సత్యమును గుర్తించలేని వ్యక్తులు అనేక వ్రతములనీ నోములనీ వుపవాసములనీ దేహమును కృశింపచేసుకుంటున్నారు. తద్వారా మనము నిత్యసత్యమైన ఆత్మతత్వమును గుర్తించలేము.

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా
తనువును తా దండించిన విషయ భోగములుడుగునా

ఆకలి దప్పులు మానినంత ఆత్మజ్ఞాని యగునా
తానెవరో తెలియకున్న తత్వజ్ఞాన మెరుగునా.

తత్వజ్ఞానము కుదరవలె నన్న తానెవరో మొట్టమొదట గుర్తించాలి. మానవుడంటే యేమిటో ఆ సత్యాన్ని మనము అర్థము చేసుకోవాలి. ఇతను నిరంతరము నూతనుడే. ఇతను సనాతనుడు కాని పురాతనుడుగానే కాదు. ఎన్ని జన్మలు ఎత్తినప్పటికి దేహము నూతనముగానే వుంటుంది. మానవత్వము దివ్యత్వముతో కూడిన ఆత్మతత్వమని యిది నిరూపిస్తుంది. కొన్ని విధములైన విచారణలు సల్పినప్పుడే దీని నిజస్వరూపము మనకు గోచరమవుతుంది. స్వస్వరూప సంధానమే దీని నిష్ఠ. ఇట్టి నిష్ఠనే జ్ఞానమునకు సరియైన ద్రష్ట. ఈ ద్రష్ట యొక్క సందర్శనమే భక్తి యొక్క ప్రభావము. ద్రష్టాధారము చేతనే దృష్టిని అభివృద్ధి పరచుకొని సృష్టిని మనము అనుభవించాలి. అంతేకాని ఆకారము వుండినంత మాత్రమున మానవత్వమని అనుకోటం అవివేకము.

ఆకారము మానవాకారముగా వుండవచ్చును. దానవ గుణములచేత యీ మానవత్వాన్ని మరుగు చేయవచ్చును. కనుక ఆకారమును చూచి మనము మానవత్వముగా భ్రమించరాదు. నిజమైన మానవత్వమనగా మా-నవ మా అనగా కాదు. నవ అనగా క్రొత్తది. క్రొత్తది కానటువంటిది మానవత్వము అంతేకాక దీనికి మరొక అర్థము కూడను వుంటున్నది. మా-న-వ మూడక్షరములతో కూడినది. మా అనగా అజ్ఞానము. న అనగా లేకుండా. వ అనగా వర్తించటము. అజ్ఞానము లేకుండా వర్తించేవాడు అనేది సరియైన అర్థము. కానీ అజ్ఞానమునకు గురియై, అశాంతికి లోనై దివ్యమైన ఆత్మజ్ఞానము లభించాలంటే యేరీతిగా సాధ్యమవుతుంది. ఈ మానవత్వమనే దివ్యత్వము మనము మొట్టమొదట అర్థము చేసుకోవాలి. అర్థము చేసుకొనక నానార్థములలో అనర్థములు మాత్రమే వుంచుకొని యదార్థమును విసర్జించటము చేత సత్యస్వరూపమును మనము గుర్తించటానికి వీలుకాదు.

ఆకుపచ్చ పక్షులన్నీ చిలుకలవలె పలుకునా
పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా
పులి చర్మము కప్పినట్టి గాడిద తా పులియగునా
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా.

కనుక ఆకారము చూచి మానవత్వముగా భ్రమించటము కేవలము అవివేకము. మానవత్వమనగ మనసు మాట క్రియయందు అన్ని ఒక్కటిగానే అతికి యుండుట. మాటయందు వేరు, పనుల యందు వేరు యీ విధమైన మార్గము అనుసించినప్పుడు మానవత్వము యెట్లా అవుతుంది. దహింప బడెడి దేహము కనుకనే యిది దేహము. శీర్ణించే శరీరము కనుకనే యిది

శరీరము. ఇలాంటి తత్త్వముల చేతనే దీనికి అనేక నామములు యేర్పడుతూ వచ్చాయి. దేహము ఒక నీటి బుడగ వంటిది. క్షణకాలములో యీ నీటి బుడగ నీటిలో లీనమవుతుందో. ఐతే యీ నీటి బుడగ యెక్కడ నుండి వచ్చింది.

నీటి యందే పుట్టి నీటియందే పెరిగి
నీటియందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు.

కనుక యీ బుడగ కేవలము నీటినుండే పుట్టినదిగా వుండినప్పుడు యీ యొక్క నరుడు కూడను నారాయణుని నుండియే ఆవిర్భవించినటువంటి వాడు. ఇట్టి సత్యాన్ని మనము గుర్తించినప్పుడే శరీరమును అలక్ష్యము చేయక, అశ్రద్ధ చేయక తగిన రీతిగా దీనిని పోషించుకోటానికి కృషి చేస్తాము. ఇది ఒక పనిముట్టు అయినప్పటికిని దీనికి తగిన హద్దులు, హంగులు కూడను వుండాలి.

జగత్తునందు ప్రతి పదార్థమునకు కూడను కొన్ని నియమములు వుంటున్నవి. నక్షత్రయో నియమం వినా. ఈ దేహము కూడను యనేక నియమములతో కూడినది. మన ప్రవర్తనల యందు గానీ, మన మాటలయందు గాని, మన భావముల యందు గాని ఒక విధమైన పవిత్రతను మనము అభివృద్ధి పరచుకోవాలి. అట్లు పవిత్రము గావించుకొనక అనుగ్రహించిన అంగము లన్నీ అపవిత్ర మార్గములో ప్రవేశపెట్టినప్పుడే మానవత్వము దానవత్వముగా మారిపోతుంది. మన జీవితము అంతయు ఒక వ్యాపార రంగముగా వుంటున్నది. మన దేహములో వుష్ణము 98.4°F కాని యీ ఉష్ణము 99°F కిపోతే యిది రోగమవుతుంది. మన blood pressure కూడను 120/80 వుంటుంది. కాని యిది 90 గాపోతే మన blood pressure కూడను రోగముగా మారుతుంది. మన eye ball కూడను యెంత వెలుగునో అంత వెలుగును మాత్రమే చూడగలదు ఎక్కువ వెలుతురు చూచినప్పుడు రెటీనా burn అవుతుంది. మన ear drums కూడను ఎంత శబ్దమో అంత శబ్దమే వినగలదు. అది తప్పైన శబ్దము వినినప్పుడు ear drum కూడను బ్రద్దలవుతుంది. కనుక మన దేహమంతయు కూడను ఒక Limited company. ఇలాంటి దేహము కాపాడుకోటం అవసరము. కొంత limit కావాలి. దీనికి తీసుకునే ఆహారము లో కొంత పరిమితము వుండాలి. త్రాగే నీటి యందు పరిమితము వుండాలి. మాటల యందు పరిమితము. వినటము యందు పరిమితము. మన జీవితమంతా ఒక పరిమితమైనదిగా వుంటున్నది. పరిమితమునకు మితి మీరినప్పుడే ప్రమాదమునకు గురి అవుతుంది. అతితిండి మతిహాని.

221059005

మిత తిండి అతి హాయి. అతిభాష మతి హాని. మిత భాష అతి హాయి. కనుకనే మానవుడు దేహమును యేవిధమైన మార్గములో అనుభవింప చేసుకోవాలో ఆ ఆనందమునకు సరియైన మార్గమునే మనము అనుసరించాలి.

మానవునకు ఐదు విధములైన విచారణా శక్తులు వుంటున్నాయి. దీనినే విజ్ఞానమన్నారు. ఈ నాడు సామాన్యముగా ప్రపంచమంతా వ్యాపించిన జ్ఞానము ఒకటి. అదే తెలివితేటలతో కూడినది. మొట్టమొదటి దీనినే bookish knowledge అన్నారు. ఈ bookish knowledge, superficial knowledge గా మారి పోయింది. ఈ superficial knowledge తోపాటే మన కాలమంతా వ్యర్థము చేసుకుంటున్నాము. ఈ వయస్సునందు ఈ మానవునకు వుండవలసిన general knowledge, commonsense zero గా వుంటున్నది. General knowledge, commonsense కేవలము విద్యవలన లభించేది కాదు. నిత్యజీవితములో కర్తవ్య కర్మల వల్లనే ఈ general knowledgeని మనము పోషించుకోవచ్చును. సమాజసేవ వల్ల, సమాజ సంపర్కము వల్ల ఈ general knowledge పోషించుకోటానికి అవకాశము వుంటున్నది. ఇంక నాల్గవది discrimination knowledge. ఈ discrimination knowledge యేవిధముగా వున్నదని మనము విచారణ చేసినప్పుడు యిది స్వార్థ పరమైన discrimination గా వుంటున్నది. తమ దోషములను తాము కొంతవరకు సమన్వయము చేసుకొనే discrimination గా వుంటున్నది. ఇది వ్యక్తి సంబంధమైన discrimination గా వుంటున్నది. కనుకనే ఈ discrimination పెడ మార్గము పడుతున్నది. యిది సరియైన discrimination కాదు. సమిష్టి సంబంధమైన discrimination కావాలి. ఎవరికి వారు సమర్థించుకొనే discrimination చేస్తున్నాడు. నాది రైటు. నాది రైటు. ఇది స్వార్థ పరమైన discrimination. అందువలననే యువకులు పెడమార్గము పట్టటానికి చాలా అవకాశము యేర్పడుతున్నది. ఇది fundamental discrimination కావాలి. ఎవరికి సంబంధించినప్పటికి అందరికి సమన్వయమయ్యే discrimination గా వుండాలి. 2+2=4. రష్యన్సు గాని, చైనీస్ గాని, అమెరికన్సుగాని, పాకిస్తాను వారు గాని, యిండియన్సుగాని అందరు యిది ఒప్పుకోవలసినదే గాని తప్పదు. కాని యిక్కడ ఆధ్యాత్మిక మార్గమునందు 3-1=1 అంటుంది. యిది ఎవరూ అంగీకరించరు. ఇది fundamental కాకుండా individual discrimination గా వుంది. కాని ఆధ్యాత్మికము అలాంటి సంకుచితమైన discrimination యేనాడు చేయదు.

వారు అర్థము తెలుసుకోలేక విచారణ చేసుకోలేక యిది కేవలము వ్యక్తిగతమైన విచారణాశక్తి అనుకోవచ్చును. ఏ వ్యక్తిని మనము ప్రశ్నించినప్పటికిని 3-1=1 అంటే యిది mathematics లో తప్పు అంటారు. కాని యిది రైటు అని నేను వాదిస్తాను. కారణం ఏమిటి? యిది వ్యక్తిగతమైనది కాదు. వ్యష్టి సంబంధమైనది. ఆత్మసంబంధమైనది. అమర సంబంధమైనది. అమృత సంబంధమైనది. ఏ విచారణాశక్తి ద్వారా మార్పు చెందటానికి వీలు కాదు. కనుకనే యిది యీ విధమైన discrimination లోపల కొన్ని విధములైన మార్పులు కలగటంచేతనే మానవత్వాన్ని సక్రమమైన మార్గములో గుర్తించలేక పోతున్నారు. కారణం ఏమిటి? యిదవ విచారణా శక్తి అత్యవసరము. అదే Practical Knowledge. ఈ Practical Knowledge లేకపోవటం చేతనే యిన్ని విధములైన అపోహలకు గురైపోతున్నాడు మానవుడు. ప్రతి విషయమునకు Practical Knowledge కావాలి. ఈనాడు Practical Knowledge అంటే యేమిటో వారికి అర్థము కావటంలేదు. ఏ వ్యక్తి తనకు సంబంధించినది తన అనుభూతిగా భావిస్తున్నాడు. నేను సమాజములో ఒకడను. సమాజము యొక్క సమిష్టి తృప్తిని కూడను నేను అనుభవించాలి. ఇక్కడ చక్కని విచారణ చెయ్యాలి. సముద్రమునుండి యేరీతిగా అలలు పుట్టువిస్తున్నవో, సూర్యుని నుండి యే విధము గా కిరణములు ఆవిర్భవిస్తున్నవో ఒక్క దైవమునుండి ఆవిర్భవించినదే ప్రేమ. ఈ ప్రేమకు భగవంతునికి యెట్టి భేదము లేదు. సూర్యుని కిరణములకు యే విధమైన భేదములు వుండవు. సముద్రమునకు అలలకు యే విధమైన భేదము లేదు. ఇవి అన్యోన్యాశ్రయములు. అవినాభావ సంబంధము. అదే విధముగనే యీ దేహము కూడను దివ్యమైన ఆత్మతత్వమునకు సంబంధించిన సత్యమును మనము గుర్తించాలి. దేహమందు ఆత్మదేవుడుండెను సుమా. ఈ దేహము అనిత్యము, అశాశ్వతము అయినప్పటికిని నిత్యసత్యాన్ని గుర్తించే వరకు కూడను యీ దేహమును మనము ఆధారముగా తీసుకోవాలి.

అనేకమంది యీ దేహ పోషణలోపల అలక్ష్యము చేస్తున్నారు. కనుకనే దేహము అనేక రోగములకు గురౌతున్నది. ఈ రోగముల చేత తమ దివ్యమైన ఆనందమును అందుకోలేక పోతున్నారు. ధర్మార్థకామ మోక్షానాం ఆరోగ్యం మూల ముత్తమం. చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థకామ మోక్షములను ఆశించవలెనన్నను, అనుభవించవలెనన్నను యీ దేహమునకు ఆరోగ్యము అత్యవసరము. ఇక దీనికి యే విధమైన మార్గాన్ని మనము అనుసరించాలి. సరియైన విచారణ చేత ప్రవర్తనలో మార్పులు తెప్పించుకోవాలి. ఆహారములో కలిగే

22059007

అనారోగ్యము కంటె మానసిక సంబంధమైన అనారోగ్యమే యీనాడు అభివృద్ధి అవుతున్నాది. నిరంతరము మానవుడు యోచించటమా యోచించటము. యీ యోచనకు రూపము ఏమిటి? ఈ విచారమునకు రూపము ఏమిటి? What is the shape of worry? It is only mental created fear. మనము మానసిక సంబంధమైన ఆలోచనల చేతనే అనారోగ్యమునకు గురౌతున్నాము. మనము యేమాత్రము ఆలోచన చేయకూడదు. ఈ ఆలోచన ఒక్కొక్క సమయము లోపల హద్దు మీరిపోతున్నాది. ఇది హద్దు మీరిపోయినప్పుడు అస్తవ్యస్తముగా మారిపోతుంది. తద్వారా కొంతవరకు మానసిక సంబంధమైన వ్యాధులు కూడను సంభవిస్తాయి. ఈ లోకములో మతిభ్రమణము కలగటానికి కారణం యిదియే. ఎంతవరకో అంతవరకు చింతించాలి. మితిమీరిన చింతన చేయకూడదు. అవసరమైనది ఆ సమయమునకు మాత్రమే మనము చింతించాలి. గడచిపోయిన దానిని, రాబోయే దానిని మనము అనవసరముగా చింతించి అనారోగ్యమునకు గురౌతున్నాము. ఈనాటి యువకులు యీవిధమైన వ్యాధులకే గురైపోతున్నారు. ఒక్కొక్క యూనివర్శిటీ లోపల పరీక్ష చేసి చూచినప్పుడు 80%, 90% అంతా కూడను మానసిక సంబంధమైన భ్రాంతుల చేతనే అనారోగ్యము పొందుతున్నారు. కనుక మనము యీ వయస్సులో, మంచి పవిత్రమైన వయస్సు, యేమాత్రం అనారోగ్యమునకు గురికా కూడదు. సాధ్యమైనంత వరకు మానసిక సంబంధమైన విచారణాలు తగ్గించుకోటానికి చూచుకోవాలి. అధికముగా చదవటముగాని, అధికముగా ఆడటముగాని, అధికముగా పాడటంగాని, అధికముగా నిద్రించటంగాని శరీరమునకు హాని కలిగిస్తుంది.

ఇంతేకాదు మనము ceiling on desires లోపల నాలుగు రకములైనవిగా బోధిస్తూ వచ్చాము. మొదటిది don't waste food. ఎందుకోసము మనము waste చేయకూడదు. Food is God. ఈ food నుంచి వచ్చినదే మన జీవితము. ఇది అన్నమయమైన జీవితము. ఇది అన్నగత ప్రాణము. కనుకనే మనము ఆహారము వ్యర్థము చేసినప్పుడు మన జీవితము వ్యర్థము చేసుకున్నవారమవుతాము. ఇంక don't waste money. misuse of money is evil. ఈనాడు యువకులు అనవసరమైన రీతిగా ఖర్చు చేస్తున్నారు. ఇది దురభ్యాసమునకు గురౌతున్నది. దుర్మార్గములో ప్రవేశింపచేస్తుంది. అనేక విధమైన అశాంతికి గురిచేస్తుంది. సాధ్యమైనంత వరకు కూడను తగ్గించుకోటానికి ప్రయత్నించాలి. యిది సరియైనది కాదు. మన భారతదేశము ఆర్థికముగా అనేక చిక్కులలో చేరివుంటున్నాది. స్వార్థము అభివృద్ధి కావటం చేతనే యీ economy లోపల చాలా హీన పరిస్థితి యేర్పడి

పోయింది. ఈ స్వార్థము, స్వప్రయోజనము దూరము గావించినప్పుడే మన దేశము బాగుపడుతుంది. సమిష్టి భావమును మనము పెంచుకోవాలి. జాతి సమైక్యతను మనము పెంచుకోవాలి. ఈ సమైక్యత వచ్చినప్పుడే మన ఆర్థిక పరిస్థితి గాని, ఆధ్యాత్మిక స్థితి గాని చక్కగా సరియైన స్థితిలో balanced గా వుంటుంది. మన జీవితమంతయు ఒక balance పైన ఆధారపడి వుంటుంది. నడవటానికి balance కావాలి. కూర్చోటానికి balance కావాలి. సైకిలు తొక్కటానికి balance కావాలి. car drive చేయుటానికి balance కావాలి. Life అంతా ఒక balance. ఈ balance యీనాడు తప్పిపోయింది. కారణం యేమిటి? మితిమీరిన తెలివి పెరిగిపోయింది. Knowledge చాలా అధికమైపోయింది. ఈ Knowledge ని సక్రమమైన మార్గములో పెట్టాలంటే దీనిని skill చేయాలి. ఈ Knowledge ని skill చేసినప్పుడే balance సక్రమముగా వుంటుంది. కానీ దురదృష్టవశాత్తు యీ యువకులు Knowledge ని kill చేస్తున్నారు. దానివల్లే balance తప్పిపోయింది. దేనిలో kill చేస్తున్నారు. మన చూపుల లోపల మన Knowledge అంతా వ్యర్థమై పోతున్నది. మన వినికిడి లోపల కూడను మన Knowledge వ్యర్థమై పోతున్నది. మాటల చేత కూడను Knowledge వ్యర్థమై పోతున్నది. తలపుల చేతను Knowledge వ్యర్థమై పోతున్నది. ఒక చిన్న ఉదాహరణము. ఒక రేడియో వుంటున్నది. ఆ రేడియో లోపల ఒక station మనం పెట్టుకున్నాము. దానిని పెద్దగా పెట్టుకోవచ్చును, చిన్నగా పెట్టుకోవచ్చును volume. యీ వాల్యూమ్ లోపల వ్యత్యాసము చేయనక్కరలేదు. ఐతే దానిని ఆన్ చేసి పెట్టావంటే నీవు విను వినకపో అది పెద్ద శబ్దముగా పెట్టు, చిన్న శబ్దముగా పెట్టు యెన్నియో యూనిట్లు కరెంటు వ్యర్థమవుతుంది. అదే విధముగా మన దేహము ఒక రేడియో వంటిది. మనము నిరంతరము యోచన చేస్తున్నాము. మాట్లాడుతున్నాము. గట్టిగా మాట్లాడుతున్నాము. తనలో తాను మాట్లాడుతున్నాడు. నిద్రలో మాట్లాడుతున్నాము. నిద్రవచ్చేంత వరకు మాట్లాడుతున్నాము. ఎప్పుడు చూచినా తెల్లవారి లేచినది మొదలు మనలో మన మాటలు జరుగుతూనే వున్నాయి. తద్వారా ఎంత energy మనకు వ్యర్థమై పోతుండాది. ఈ energy waste కావటం చేతనే allergy గా మారి పోతుండాది జీవితము. కనుక యీ దేహము నందుండిన శక్తిని సద్వినియోగ పరచుకోటానికి తగిన కృషి చేయాలి. అప్పుడే మనకు చక్కని balance కూడను యేర్పడుతుంది.

విద్యార్థులారా! దేహము ఆరోగ్యముగా పుష్టిగా సంతుష్టిగా వుండినప్పుడే మన balance సరియైన స్థితిలో మనము అనుభవించవచ్చు. గడచిన దానిని మీరు

యే మాత్రము చింతించనక్కరలేదు. Past is past forget the past. నడచుకొని వచ్చిన రోడ్డు చూచుకొనే వచ్చాము కదా. ఇంక వెనుకకు ఎందుకు చూడాలి. ఇది ఎన్నిలక్షలు ఖర్చు పెట్టినా ఎన్నికోట్లు ఖర్చుపెట్టినా తిరిగి ఒక సెకండైనా ఒక యించైనా ముందుకు రాదు. అలాంటి రాని దాని నిమిత్తమై మనము యెందుకు యోచన చేయాలి. ఇంక future యిది మనకు తెలియదు. అగాధమైనది. రేపు రేపు అనే భావన చేసినప్పుడు రేపటి వరకు మనము వుండేది యేమి షూరిటీ. రేపు అనేది మనకు యే మాత్రము నమ్మకము వుంది. కనుక నమ్మకము లేనిదాని నిమిత్తమై మనము యెందుక యోచన చెయ్యాలి. future is not sure. అలాంటి దానికి ensure చేయటం ఎందుకు. ఈ రెండు రకములైన చింతలచేత మన జీవితము వ్యర్థమై పోతున్నది. ఈనాటి మానవుడు దుఃఖమునకు గురికావటము విచారమునకు గురికావటము, అనారోగ్యమునకు గురికావటము దీనికి కారణము యేమిటి? ఉన్నదానిలో తృప్తి పడక లేని దానికి అవస్థలు పడుతున్నారు. అందువలనే అశాంతికి గురై పోతున్నాడు.

విద్యార్థులారా! గతము గతము. భవిష్యత్తు భవిష్యత్తు. ఈ రెండింటిని మనము విచారణ చేయనక్కరలేదు. వర్తమానము చాలా ప్రధానమైనది. Present, this is not ordinary present but omnipresent. భవిష్యత్తు యీ present లో వుంటున్నది. Past యొక్క ఫలితము present లో వుంటున్నది. ముందు యే విత్తనము నాటామో ఆ మొక్క వచ్చింది. ఇప్పుడు యే మొక్కను నాటుతామో ఆ ఫలము ముందుకు అనుభవిస్తావు. కాబట్టి future and past రెండు కూడను present లో వుంటున్నది. కనుక వర్తమానమును సక్రమమైన మార్గములో అనుభవించండి. ఎట్టి విచారములకును అవకాశము నందించకూడదు. ఈ సక్రమమైన మార్గమును అనుభవించినప్పుడు మన జీవితము ఆదర్శవంతమైన జీవితముగా మారుతుంది. అమృతమయమైన జీవితముగా మారుతుంది. అమరత్వమును పొందుతుంది. మానవ్యమును సార్థకము గావిస్తుంది.

విద్యార్థులారా! దేహము యొక్క విశిష్టతను అలక్ష్యము చేయకూడదు. అన్ని అనిత్యమే యీ జగత్తునందు. ఐతే అన్నింటిని అలక్ష్యము చేస్తున్నామా లేదు. అనిత్యం అసుఖం యీ రెండు రూపములలో చేరినది జగత్తు. దీనిని సరియైన రీతిలో అనుభవించి, సరియైన రీతిలో దీనిని వినియోగపెట్టుకోటానికి ప్రయత్నించాలి. కనుక దేహమంటే ఒక దేవాలయముగా భావించి యీ దేవాలయము యిటువంటి దేవాలయము నడిచే దేవాలయము

ఎక్కడ నడుస్తుంటే అక్కడంతా దేవుడున్నాడు. ఇది moving temple. ఇలాంటి దేవాలయమును మనము సార్థకమైన రీతిగా మనము అనుభవించాలి. ఏది చూసినా దేవుడున్నాడు లోపల అనే ఆత్మవిశ్వాసమును మనము పెంచుకోవాలి. ఈ ఆత్మవిశ్వాసము లేకుండా లోకవిశ్వాసము చేతనే మనము జీవితము గడపటం చేత అశాంతికి గురైపోతున్నాము.

గోడ కట్టాలంటే పునాది భద్రముగా వుండాలి. అప్పుడే గోడ భద్రముగా వుంటుంది. గోడ భద్రముగా వుండినప్పుడే మనము roof భద్రముగా వేయవచ్చు. roof భద్రముగా వుండినప్పుడే నివాసము అందులో ధైర్యముగా చేయవచ్చు. కనుకనే self confidence foundation, self satisfaction wall, self sacrifice roof, self realisation life. ఈ self అంటే యేమిటి? రెండు రకములైన self లు వుంటున్నాయి యిక్కడ. I ఒక self. ఇక రెండవది eye యిది మూడక్షరముల I. Three letters I నే body ఏకాక్షర I ని ఆత్మ. ఏకం సత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం. ఈ I అనే ఏకాక్షరము సర్వులయందు వుంటున్నాది. ఈ మూడక్షరముల eye కొంతమందికి లేకుండా వుండవచ్చును. కొంతమందికి వుండి కూడను క్యాటరాక్ట్ రావచ్చును. ఇంకా వేరు వేరు దోషములు అందులో ప్రారంభము కావచ్చును. కాని యోగి భోగి రోగి విరాగి వైరాగి సర్వులయందు ఏకాక్షర I సమముగానే వుంటుంది. ఇప్పుడు భగవతి అని నేను పిల్చాను. ఆయన నేను I అంటాడు. వాక్సర్ అని నేను పిల్చాను ఆయన నేను అంటాడు. అర్జున్ గుప్తా అని పిల్చాను ఆయన I అంటాడు. చబ్బర్ అని పిల్చాను ఆయన I అంటాడు. భగవతి, వాక్సర్, చబ్బర్, సింగ్ రూపనామములు వేరైనప్పటికిని అందరినుండి I, I అనే జవాబు ఒక్కటిగానే వచ్చింది. రూపనామములు వేరైనప్పటికి యీ I అనేది అందరియందు ఒక్కటే. దీనినే వేదాంతము ఏకం సత్ విప్రా బహుధా వదంతి. కనుక యువకులు యీనాడు unity in diversity అనేకత్వములోని యేకత్వమును అనుభవించటానికి ప్రయత్నించాలి. ఈ ఏకత్వమును అనేకత్వముగా భావించటం చేతనే యీ అశాంతికి గురైపోయింది లోకము. పాకిస్తాన్ వేరు, ఇండియా వేరు రష్యా వేరు చైనా వేరు అమెరికా వేరు అని యీ రకముగా భేదములుండవచ్చును. కాని అన్నీ కలసి ఒకే భూమిపైన వున్నాయి కదా. ఈ రకమైన ఏకత్వమును మనము పెంచుకుంటే యీ భిన్నత్వములో అసూయలుగాని క్రోధములు గాని వుండటానికి వీలుకాదు.

Sky is one but stars are many
Nations are many but earth is one
Beings are many but breath is one

ఈ రకమైన ఏకత్వమును భావించుకుంటే నిజమైన ఆనందము మనలో ఆవిర్భవిస్తుంది.

విద్యార్థులారా! ఇది చాలా పవిత్రమైన వయస్సు. మీరు భిన్న భావములకు యేమాత్రము అవకాశము యివ్వకూడదు. యీ విధమైన మార్పులు అనారోగ్యమే. చూడటానికి దేహము పుష్టిగా కనుపించవచ్చు. కాని మానసిక తత్వము చాలా బలహీనముగా వుండవచ్చును. మనము healthy body లోనే healthy mind వుంటుంది. మన body యే విధముగా వుంటుందో దానిలో భావములు కూడను ఆ రకముగానే వస్తూ వుంటుంటాయి. మంచి పుష్టిగా సంతుష్టిగా వుండిన దేహము నుంచి దృఢమైన సంకల్పములు మనకు ఆవిర్భవిస్తూ వుంటాయి. బలహీనమైన దేహము నుండి అన్నీ అనుమానములే ఆవిర్భవిస్తూ వుంటాయి. కనుక మనకు మనమే బలులమా అబలులమా అనే విషయాన్ని విచారించుకోవచ్చు. నీ సంకల్పము యెట్టిదిగా వుంటుందో నీ బలము అట్టిదిగా వుంటుంది. కనుకనే యద్భావం తద్భవతి. దేహము అనిత్యమే నీటి బుడగయే. అశాశ్వతమే. మరణమే. కాని యిందులోనే ఒక రత్నము ఒక దివ్యత్వమైన ఆత్మ తత్వము వుంటున్నది. దాని నిమిత్తమై యీ దేహమును కాపాడుకోవాలి. ఇనుప పెట్టెకు ఒక వెల వుండదు. కాని వెల లేని యినుప పెట్టె లోపల చాలా విలువైన నగలు పెట్టాము. ఆ నగల నిమిత్తమై యినుప పెట్టెను కాపాడుకోవాలి. అందులో యేమాత్రము నగలు లేకపోతే యినుప పెట్టెను కాపాడనక్కరలేదు. కనుక యిది యినుప పెట్టె వంటిది. ఇందులో భద్రమైన ఆత్మ వుంటున్నది. దాని నిమిత్తమై యీ దేహమును కాపాడుకోవాలి. జీవించుటము కోసము భుజించాలి గాని ఆహారము కోసము భుజించరాదు. ఈనాడు ఆహార నిమిత్తమై జీవించినట్లుగా భావిస్తున్నారు. మనకు నిజముగా ఆత్మవిశ్వాసమే వుంటే ఆహారము మన దగ్గరకు నడచుకుంటూ వస్తుంది. అన్నము కోసము మనము వెదుకులాడనక్కరలేదు. భాగవతమందు కూడను ఆత్మ కోసం వెతికేవాడు గోపి అన్నము కోసము వెతికేవాడు పాపి అన్నారు. ఆత్మాన్వేషణకై వచ్చి మనము అన్నాన్వేషణ జరుపుతున్నాము. ఆత్మానుగ్రహము వుంటే అన్నాన్వేషణ జరుప నక్కరలేదు. పుట్టించినవాడు పెట్ట లేకపోతాడా? యీ విశ్వాసాన్ని మనము బలపరచుకోవాలి. నాయనా నిన్ను నీవు తెలుసుకో. నిన్ను నీవు చూచుకో. నిన్ను నీవు గుర్తించుకో అని నీకు బోధిస్తూ వచ్చింది వేదాంతము. కాని యీ సత్యాన్ని విస్మరించారు మానవులు. ఓరే బాబు నీ ముఖాన్ని నీవు చూచుకోరా అని అద్దమును చేతికిస్తే ఆ అద్దము యింకొకరి ముఖము ముందు పెడితే నీ ముఖము ఎట్లా కనబడుతుంది. నీ ముఖము నీవు

చూచుకోలేదు. ముఖాన్ని చూచుకొనే బుద్ధి అనే అద్దాన్ని పరుల ముఖము ముందు పెడుతున్నావు. అందువలననే నీ దోషములను నీవు గుర్తించుకోలేకుండా పోతున్నావు.

ఆత్మ విశ్వాసమును మనము బలపరచుకోవాలి. ఈ ఆత్మ విశ్వాసము వుండినప్పుడే మనకు ఆనందము లభ్యమవుతుంది. విచారములు యేమాత్రము మనము చేయకూడదు ధైర్యముతో వచ్చిన కష్టములు నష్టములు దుఃఖములు ఎదుర్కొనటానికి తగిన బలమును సంపాయించుకోవాలి. అందుకనే మన education system లోపల 4 F లు అని బోధించాను. మొదటి F. Follow the master. నీ conscience ని follow చెయ్యి. 2వది Face the devil. మూడవది Fight to the end. నాల్గవది Finish the game. ఇదే నిజమైన తత్వము. ఈ విషయములో నీవు నిరంతరము చదువును సాధిస్తూ రావాలి. ఏమిటి యీ చదువులు. ఆంగ్ల చదువుల లోపల A BC అని వుండాది. ఈ ABC అంతరార్థము ఏమిటి? Always be careful. ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత. ఇలాంటి చదువుల లోపల సంస్కృతికి సంబంధించిన చదువులు మనము చదవాలి.

విద్యార్థులారా! ఎంతకాలము మనము బ్రతికినప్పటికిని ఎన్ని జ్ఞానములు మనము తెలుసుకున్నప్పటికిని ఎన్ని పదవులు పొందినప్పటికిని ఏనాటికైనా మన తత్వాన్ని మనము గుర్తించక తప్పదు. ఇలాంటి సత్యాన్ని ఇప్పటికే తెలుసుకోవలసింది. ఎప్పటికప్పుడే నీవు జాగ్రత్తగా వుండు. భగవదనుగ్రహముగాని, భగవంతుని ప్రేమగాని, భగవంతుని ఆశీర్వాదముగాని ఎప్పుడు ఎక్కడ ఏ విధముగా లభిస్తుందో. భౌతికమైన లౌకికమైన ప్రపంచమందు మనకు తెలుస్తా వుండాయి, అర్థమవుతూ వుంటాయి. ఆధ్యాత్మికములో మనకు యేమి తెలియదు అర్థము కాదు. మన కర్తవ్యమును మనము ఆచరిస్తూ పోతుంటే ఎప్పటికప్పుడు మనము సంసిద్ధమైన ఆనందమును చేర్చుకొనివుంటే అదే మనకు ఆనందమును చేకూరుస్తుంది. రాబోయేదాని నిమిత్తమై మనము విచారము చేయకూడదు. గడచిపోయినదానిని యేమాత్రము చింతించకూడదు. అన్నీ passing clouds, passing clouds. ఈ ప్రపంచములో ఒక వస్తువుగాని ఒక వ్యక్తిగాని, ఒక విషయముగాని శాశ్వతమైనది ఒక్కటి లేదు. దీని పేరే జగత్. జ-గత్ రావటము - పోవటమే. ఈ సత్యాన్ని గుర్తించుకొని మనము ఎందుకు విచారము చెయ్యాలి. కనుక యీ విచారమునకు యేమాత్రము అవకాశము నందించరాదు. అప్పుడే మానవత్వము తగిన దివ్యత్వమును పొందటానికి అర్హత చేకూరుతుంది. ఒక్క మానవత్వమునకు తప్ప అన్య జీవులకు యీ అవకాశము లేదు.

దీనికి ఆహార విహారములే మూలకారణము. జగత్తునందు పుట్టిన 84 లక్షల జీవరాసులలో 83 లక్షల 99 వేల 999 తమ సహజ ఆహారాన్ని తాము అనుభవిస్తున్నాయి. పశుపక్షి మృగాదులు భగవంతుడు అందించిన సహజాహారాన్ని అందుకుంటున్నాయి. వీటికి యే మాత్రము అధిక జబ్బులు చేయటం లేదు. కానీ మానవుని జిహ్వ చాపల్యము చేతనే వాడు అనేకమైన రుచులకు మరిగి దీనిని కల్పితమైన పక్వాలుగా మార్చుకుంటూ వస్తున్నాడు. దీనిని పోషము చెయ్యాలి. నా టేస్టు నిమిత్తము కూర్లలు అన్నీ కావాలి. కాని వాని ఆయుఃప్రమాణము ఎంత [illegible] అయిపోతున్నాడో వాడు యోచన చేసుకోటం లేదు. ఇందులో కూడా ఆహార నిమిత్తమై కూరగాయలు ఆహారము తినేవారికి తక్కువ జబ్బులు వస్తున్నాయి. కూరగాయలు లేకుండా మాంసాహారము తినేవారికి ఎక్కువ జబ్బులు వస్తున్నాయి. కారణం ఏమిటి? మానవునికి సమన్వయమైన ఆహారము సరియైన balance ఇస్తుంది. ఇది human body. అది animal body. ఈ రెండిటికి సరియైన పొందిక కుదరదు. పెద్ద డాక్టర్లు చెబుతూ వుంటారు. ప్రోటీన్సు అంతా మీట్లో వుంటాయి భుజించండి పుష్టిగా అవుతారని. కేవలము వారి బలహీనత. త్రాగే పాలలో ప్రోటీను లేదా. పెరుగులో ప్రోటీను లేదా. బొడలలో ప్రోటీను లేదా. ప్రోటీను ఎక్కడైనా వుంటున్నాది. ఇది కేవలము శారీరకమైన అనారోగ్యమే కాకుండా మానసిక సంబంధమైన అనారోగ్యమును కూడా పెంచుతున్నాయి. కనుక మన మైండ్ ఎట్లా పోతున్నాదంటే food head God ఈ మూడింటికి సన్నిహిత సంబంధము అవుతున్నాది. ఈ animal food ను మనము భుజించటం చేత animal thoughts మనకు మనలో ప్రారంభమవుతాయి. చూశారా! ఎట్టి ఆహారమో అట్టి భావము. కనుక యీనాడు మన మానవత్వమునకు విరుద్ధమైనటువంటి అమానుషత్వమును అనుభవిస్తున్నారంటే ఎంత ఘోరమైనటువంటిది. అడవులలో సంచరించే మృగముల కంటె హీనమై పోతున్నది మానవుని యొక్క మనస్సు. నిర్దాక్షిణ్యముగా, నిర్మోహముగా, అప్రీతిగా మానవత్వమును హింసిస్తున్నాది. మానవునికి మానవునికి మధ్యనే సన్నిహిత సంబంధ బాంధవ్యము కోల్పోతున్నాది. కారణము మన ఆహార దోషమే.

విద్యార్థులారా! ఆహార విహారాన్ని సరియైన దృష్టిలో మీరు వుంచుకోవాలి. ఏ ఆహారము సరియైన ఆరోగ్యమునుగాని ఆనందమునుగాని అందిస్తుంది అనే విచారణ చెయ్యాలి. పూర్వీకులు దినమునకు రెండు పర్యాయములు భుజించేవారు. మహర్షులు దినమునకు ఒక పర్యాయమే భుజించేవారు. ఒక పర్యాయము భుజించేవాడు యోగి అన్నారు. రెండు పర్యాయములు

భుజించే వాడు భోగి అన్నారు. మూడు పర్యాయములు భుజించే వాడు రోగి అన్నారు. ఈనాడు మూడు కాదు ఎన్నెన్నో పర్యాయములు, మధ్యే మధ్యే పానీయం సమర్పయామి. కాఫీలు, టిఫన్లు ఇంకా వన్నీ వేస్తున్నాము. ఈ విధముగా యీ జడమైన దేహమునకు సరియైన జీర్ణ శక్తి లేనప్పుడు దీనికి అజీర్ణ వ్యాధి సంభవించక యేమవుతుంది. ఒక్కొక్క నిముషమునకు ఒక్కొక్క క్యాలరీ ఖర్చవుతున్నది. యువకులైనవారు రెండువేల క్యాలరీలు చక్కగా తినవచ్చు. సరైన రీతిలో మనము balance లో వుండాలంటే 1500 క్యాలరీలు చక్కని ఆరోగ్యము నందిస్తుంది చిన మనకు. కాని యీనాడు మనము నాలుగువేలు, ఐదువేలు క్యాలరీలు తింటున్నాము. తద్వారా నిద్రపట్టదు. వానికి వికారమైన భావాలంతా వస్తుంటాయి. ఈ వికారమైన భావముల లోపల తన ఆకారమును మరచిపోతున్నాడు. అనారోగ్యమునకు గురౌతున్నాడు. కనుక దేహమును సాధ్యమైనంతవరకు హద్దులో వుంచుకొని ఆరోగ్యమును పెంచుకొని మనము సక్రమమైన మార్గము లోపల కర్తవ్యకర్మలందించటానికి మనము పూనుకోవాలి. అమితముగా దేహభ్రాంతిని పెంచుకోరాదు.

ఇది నాది అనే మమత్వము, నేను అనే అహంకారము యీ రెండే సమస్త అనర్థములకు మూలకారణము. కనుక కర్తృత్వ, భోక్తృత్వాలను మనము కొంతవరకు తగ్గించుకోటానికి ప్రయత్నించాలి. అప్పుడే మనము చక్కని ఆదర్శవంతమైన జీవితమును అందించగలము. మనము కొన్ని రకములైన సైకలాజికల్ గా కూడను మన జీవితములో అనారోగ్యము సంభవిస్తుంది. మీరు ఎప్పటికప్పుడే examin చేసుకోండి. నా pulse సరిగా వుందా లేదా అని చూసుకుంటే ఎక్కువ్ తక్కువో అయిపోతుంది. ఈ విధమైన యోచనలో మనము pulse చూడకూడదు. సక్రమముగా వున్నదనే self confidence తో మనము జీవితమును సాగించాలి. అవి సక్రమముగానే బయలుదేరతాయి. ఈనాడు రాత్రికి నాకు చక్కగా నిద్రపోవాలి, నిద్రపోవాలి అని పడుకుంటే ఆనాడు నిద్రరాదు. కనుక నిద్రను గురించి యోచించక చక్కగా శయనించు. గాఢ నిద్రవస్తుంది. ఇవన్నీ దేహమునకు వుండిన రోగములు. ఇవి బలహీనతలు. ఇంత బలహీనతలతో కూడిన యీ దేహమును దివ్యత్వముతో కొంతవరకు మార్చుకున్నప్పుడే యిది సర్వబల స్వరూపాన్ని పొందుతుంది. పూర్వపు మహనీయులందరు దీనిని అనుసరిస్తూనే వచ్చారు. వారు యీ దివ్యత్వమును అనుభవించే నిమిత్తమై అంతకాలము బ్రతకాలని ఆశించారు. ఈనాడు అరవై, డెబ్బై సంవత్సరములైఉండుంటే old man అంటారు. కాని పూర్వకాలము లోపల 80, 90 100 వుండినప్పుడు కూడను వారు యువకులు.

విద్యార్థులారా! మీరు చదివి వుండవచ్చును. మహా భారతములో పల 86 సంవత్సరములు కృష్ణునికి 84 సంవత్సరములు అర్జునునికి. యువకులు వారు. వారు యుద్ధములో ఎంత ధైర్యముగా, ఎంత సాహసముగా, ఎంత పౌరుషముగా, పుష్టికరమైన దేహముతో పోరాడుతూ వచ్చారు. కౌరవుల తరఫున సైన్యాధిపతి ఎవరు? భీష్ముడు. అతనికి 116 సంవత్సరములు. అతను commander-in-chief. ఈనాడు 116 యేండ్ల వాడైతే మక్కాముంచములో పడుకుంటూ పడిపోయి వుంటాడు. అతను తొమ్మిది దినములు ఘోరమైన యుద్ధము చేశాడు. దీనికి కారణము యేమిటి? వారికి మనోబలమే. వారికి ఆహార బలమే. ఆత్మబలమే. ఈ నాడు ఆత్మ బలము యే మాత్రము లేదు. ఆత్మ విశ్వాసము క్షణక్షణమునకు bumps, jumps. ఒక స్థిరత్వమే లేదు. తన అభీష్టము నెరవేరెనా ఒకరోజు పది ఫొటోలు పెట్టేస్తారు. అభీష్టమేమైనా భిన్నమాయనా ఫొటోలు అన్నీ తీసేస్తాడు. కానీ యిది సరియైన స్థిరత్వము కాదు. You may worship a picture of God as God but not God as a picture. ఈ విధమైన భావము మనము క్షణక్షణమునకు మార్చుకుంటుంటే మన జీవితము ఏ విధమైన దృఢత్వము పొందుతుంది. ఎన్ని కష్టములైనా, నష్టములైనా, దుఃఖములైనా, విచారములైనా మనము ధైర్యముగా ఎదుర్కోటానికి తగిన కృషి చెయ్యాలి. ఈనాడు ఆస్తికుడు, ఆస్తికుడు అని అనుకుంటున్నారే గాని యీ ఆస్తికుల వలనే భారత దేశములో నాస్తికత్వము అధికమైపోతూ వచ్చింది. ఈ ఆస్తికులైన వారే సరియైన మార్గమును అనుసరించటము లేదు. చెప్పుకునేది భక్తి. చేసేది భుక్తి. అది కాదు నిజమైన భక్తి. అన్నింటికిని మనము సిద్ధమూగా వుంటుండాలి.

పిలచి అడుగ చెరకు పెట్టినా బెల్లంబు
పిప్పి గొట్టి రసము పీల్చుకున్న
జాతి వజ్రమైన సాన బెట్టవలయు.

కటింగ్సు లేకపోతే దాని విలువ తగ్గిపోతుంది. బాధ లేకపోతే యీ చెరకైనా పాలు యివ్వదు. కనుక మానవుని యందు కష్టములు, నష్టములు, దుఃఖములు మథించినప్పుడే అందులో నిజమైన సారము మనకు ఆవిర్భవిస్తుంది. కనుకనే భక్తి భక్తి భక్తి అనగా అనేక వేదాంత ఉపనిషత్సారమును మథించి అందించిన సుధానిధియే యీ భక్తి అన్నారు. భక్తిలో యేమాత్రము చలనము యేర్పడకూడదు. దానిని స్థిరమైనదిగా మనము నిల్పుకున్నప్పుడే దృఢమైన విశ్వాసము కలిగినప్పుడే ఫలమును చక్కగా అందుకోటానికి మనము అర్హుల

మవుతాము.

ప్రేమ స్వరూపులారా! దేహ భావము వుండినప్పటికిని ఆత్మలక్ష్యము లోపల మనము దేహ భావమును అనుసరించాలి అనుభవించాలి. కనుక విద్వాంసులైనవారు దేహమును ఇంద్రియములను మనస్సును బుద్ధిని ఆత్మ ఇవియే ఐదు ప్రాణములు. ఈ ఐదింటి యొక్క రహస్యము మనము చక్కగా గుర్తించినప్పుడు ఇంతకంటె ఆధ్యాత్మికము మనకు అక్కరలేదు. ఏ సాధనలు కూడను చేయనక్కరలేదు. సత్యమును గుర్తించుకుంటె అంతే చాలు. సత్యమే సర్వ స్వరూపము. ఈనాడు సత్యమును గుర్తించుకొనక సాధనలు చేసినప్పటికిని అనేక అవస్థలకు గురియై పోతున్నాము. కనుక ఈ దేహసంబంధమైన, ఇంద్రియ సంబంధమైన రహస్యమును మొట్టమొదట గుర్తించుకునే నిమిత్తమై ఈ summer classes లోపల ఈ పదహైదు దినములు కూడను ఈ దేహము, ఇంద్రియములు, మనస్సు బుద్ధి ఆత్మ తత్వమును బోధించమని Vice-Chancellor కోరటం చేత ఈ శరీర సంబంధమైన విషయములు నేను చెప్పటం జరుగుతున్నది. ధ్యానము, ధ్యానము అంటున్నాము. ఏమి చేస్తున్నాము మనము ధ్యానము? కన్నులు మూసుకొని చక్కగా కూర్చుంటున్నాము. ఈ మనసు ఎక్కడెక్కడికో యే చాకలి ఇండ్లకో కుమ్మరి ఇండ్లకో బజారుకో పరుగెడుతున్నాది. ఈ విధమైన ధ్యానము లోపల కాలము వ్యర్థము చేసేకంటె కర్మలో ప్రవేశించు. సేవలో ప్రవేశించు సమాజసేవ చేయి. దాని రహస్యాన్ని గుర్తించకుండా ఎంతకాలము కన్నులు మూసుకున్నా నిద్రరావటమే గాని సమాధి నీకు కుదరదు. కనుక మొట్టమొదట మనసంటె యేమిటో తెలుసుకోవాలి. అప్పుడే కదా దానిని అరికట్టటానికి వీలవుతుంది. ఒక ముసలమ్మ వచ్చి స్వామి! ఈ పాడు మనసు హింసిస్తున్నది ఎక్కడెక్కడికో తీసుకుపోతున్నాది, నన్ను నానా అవస్థలకు గురిచేస్తున్నాది అని మొరపెట్టింది. ఎవరు నిన్ను బాధిస్తున్నారని ప్రశ్నిస్తే మనస్సు అనింది. మనస్సు ఎక్కడ వుందో చెప్పు దానిని పట్టి చంపేస్తానన్నా. ఎక్కడ వుందో నాకు తెలీదు అనింది. ఎక్కడో వున్న మనస్సు నిన్ను బాధిస్తున్నదని ఎలా తెలుసు. మనసే నిన్ను బాధిస్తున్నదో నీవు నిన్ను బాధించుకుంటున్నావో. కనుక ఫలానిది నన్ను బాధిస్తున్నాదంటె దానిని నిర్మూలము గావించటానికి ప్రయత్నము చేయవచ్చు. ఏది బాధిస్తున్నదో తెలియనప్పుడు మనస్సు పైన నెపము వేసి కూర్చుంటె అది పొరపాటవము. కనుక మనస్సు యొక్క తత్వాన్ని మనం చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ ఇంద్రియ తత్వమును కూడా గుర్తించట

221059017

నికి ప్రయత్నించాలి. ఒక్కొక్కటి కూడను దైవశక్తి లోపల చక్కని రహస్యాన్ని మూసి పెట్టింది. అర్థము లేనిది భగవంతుడు సృష్టించడు. అన్నీ అర్థవంతమైనవే. ఆనందమయమైనవే. అమూల్యమైనవే. అలాంటి ఆనందమును మనము గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. కనుక ఈ పదకొండు దినముల లోపల ఈ దేహము, ఇంద్రియములు, మనసు బుద్ధి ఈ ఆత్మ తత్వమును గురించి చక్కగా గుర్తించుకొని నిశ్చింతగా నిర్మలముగా ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారు కావాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.